ప్రజా సమస్యలపై రాధక్క రాజీలేని పోరాటం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అణగారిన వర్గాల సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన గొప్ప పోరాటయోధురాలు రాధక్క అని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కామ్రేడ్ రాధక్క (నిర్మల) సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ.. నిరంతరం పేదల మధ్య ఉంటూ.. వారి కష్టసుఖాల్లో రాధక్క భాగస్వాములయ్యారన్నారు. ఆమె ఆశయ సాధనకు కృషి చేసినప్పుడే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్


సంస్మరణసభలో మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

నాయకులు నరహరి, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కృష్ణమోహన్, రాములు, కిషోర్ తదితరులున్నారు.

అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకుంటాం


అక్రమ పార్కింగ్‌ను పరిశీలిస్తున్న ముఠా జైసింహ తదితరులు

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని మేడిబావి బస్తీ జెమిస్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాల వద్ద ప్రైవేట్ వాహనాల అక్రమంగా కొనసాగుతున్న పార్కింగ్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని బీఆర్‌ఎస్ నేత ముఠా జైసింహ తెలిపారు. ఆదివారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సుధాకర్‌గుప్తా ఆధ్వర్యంలో పాఠశాల వద్ద నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వాహనాల పార్కింగ్, వ్యర్థాలతో కలిగే ఇబ్బందుల గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తామని, త్వరలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ సందర్శించేలా చూస్తామని వివరించారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, ఎండీ.ఖదీర్, లింగం యాదవ్ తదితరులున్నారు.

దళితుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ముషీరాబాద్: దేశవ్యాప్తంగా దళితుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కేంద్రమంత్రిని ముషీరాబాద్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్‌మాదిగ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆర్పీఎస్ జాతీయ నాయకులు గండి కృష్ణ, రాష్ట్ర నాయకులు రాములు, దశరథ్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ మహేష్‌కుమార్, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ గడ్డం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ముషీరాబాద్: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్‌లోని రాంనగర్‌లో గత ప్రేయర్‌పవర్ చర్చిలో రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కల్పించారు. మురళీమోజెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి దీపక్‌జాన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రైస్తవులు అన్ని రంగాల్లో రాణించేలా సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద ఎత్తున బడ్జెట్ కేటాయించారన్నారు. అనంతరం మురళీమోజెస్ దీపక్‌జాన్‌ను సన్మానించారు. ఆలిండియా ప్రేయర్ పవర్ చర్చిస్ డైరెక్టర్ స్వామ్ అబ్రహం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దీపక్‌జాన్

చాత్తాద శ్రీవైష్ణవుల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న వేణుమాధవ్

నల్లకుంట : చాత్తాద శ్రీవైష్ణవ బంధువుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ అన్నారు. చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం న్యూ నల్లకుంట నర్మదా భవన్‌లోని చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర కార్యాలయంలో వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన వచ్చిందన్నారు. సంఘం పాలకమండలి సభ్యులు శ్రీనివాస్, సత్యనారాయణ, నీలా వెంకటరమణ, తిరునగరి విష్ణు చిత్తస్వామి, పాండు, రవీందర్, అయ్యగారి ప్రభాకర్, జనార్దన్ స్వామి వివిధ శాఖల అధ్యక్షులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని నాశనం చేయొద్దు

కాచిగూడ: ఎకో టూరిజం పేరుతో పర్యావరణాన్ని నాశనం చెయొద్దని, అది భావితరాలకు ముప్పు అని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు రంగయ్య, గౌరవ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం నారాయణగూడలో వారు మాట్లాడుతూ.. కొద్దిమంది సంతోషం కోసం 'ఎకో టూరిజం' పేరుతో మిగిలిన అడవులను నాశనం చేయొద్దని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అడవుల్లో ప్రకృతి పర్యాటకం అభివృద్ధి ఆలోచన తక్షణమే మానుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అడవుల రక్షణ, పర్యావరణ పరిరక్షణ అనేది భావితరాల మనుగడకు సంబంధించిన విషయం అన్న వాస్తవం ప్రభుత్వం మరువరాదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజలు ఎన్నో ఆశలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుకున్నారని, పర్యావరణ రక్షణ బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకోవడం సరికాదని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఎకో టూరిజం ఆలోచన మాని పర్యావరణ పరిరక్షణకు మరిన్ని పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

టైపిస్టు ఉద్యోగాలను పునరుద్ధరించాలి


సీఎంకు వినతి పత్రం అందజేస్తున్న మహ్మద్ మసూద్ అలీ, నిరుద్యోగులు

లాలాపేట: టైపిస్టు ఉద్యోగాలను పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ టైపు రైటింగ్, షార్ట్ హ్యాండ్, కంప్యూటర్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్, నిరుద్యోగ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం టైప్ రైటింగ్ ఉద్యోగాలను తీసివేయడంతో టైపు రైటింగ్ నేర్చుకున్న దాదాపు 4 లక్షల మంది నిరుద్యోగులుగా మిగిలారన్నారు. పక్కరాష్ట్రాలు కర్నాటక, తమిళనాడులో టైప్‌రైటింగ్ సర్టిఫికెట్స్ ఉంటేనే కంప్యూటర్‌లో ఇన్‌పుట్ సమర్థవంతంగా, వేగవంతంగా ఉంటుందని భావించి టైపు రైటింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోనూ సైతం ఆ పద్ధతిని అవలంభించేలా చర్యలు తీసుకోవాలని సీఎంకు విజ్ఞప్తి చేశామని తెలిపారు.

నిరుపేదలకు అండగా ..

అడ్డగుట్ట: నిరుపేద మున్నూరు కాపు కులస్తులకు అండగా ఉంటామని సికింద్రాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు లింగిశెట్టి హనుమంతు రావు అన్నారు. రెండు కిడ్నీలు పాడైపోయి చికిత్స చేయించుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నా సంధ్య అనే మహిళకు మున్నూరు కాపు సంఘం నాయకులు ఆది వారం ఆర్థిక సాయం అందజేశారు. కాచిగూడ మున్నూరు కాపు మహాసభ తరఫున రూ.30 వేలు, తోట రఘునాథ్ రూ. 50 వేలు, సికింద్రాబాద్ కాపు సంఘం నుంచి రూ. 50 వేలు మొత్తం రూ. 1.30 లక్షల ఆర్థిక సాయం చేశారు.

'బడిబాట' పట్టేనా..?

పాఠశాలలు ప్రారంభమై వారం రోజులై విద్యార్థులు బడిబాట పడుతున్న సందర్భంగా సమస్యలు పరిష్కారం కావడం లేదు. దీర్ఘకాలంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు నోరు మెదపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- అధ్వానంగా శానిటేషన్ నిర్వహణ
- సమస్యలను పట్టించుకోని అధికారులు
- పరిష్కరించాలని ఉపాధ్యాయుల వినతి



కవాడిగూడ ప్రభుత్వ పాఠశాల

కవాడిగూడ : చిత్రాలనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో అన్ని సమస్యలే విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. సుమారు 900లకు పైగా విద్యార్థులు చదువుకుంటున్న ఈ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. ఇంత మంది చదువుతున్న ఈ పాఠశాలలో స్కావెంటజర్లు లేక పోవడంతో పాఠశాల ఆవరణలోని మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారి అధ్వానంగా తయారయ్యాయి. విద్యార్థులు తమ అవసరాలు తీర్చుకునేందుకు తమ ఇళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

అన్ని పాఠశాలల్లో ఇదే పరిస్థితి..

విద్యార్థులకు మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నా.. స్కావెంజర్లను నియమించకపోవడంతో సమస్యగా మారింది. ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. అపరిశుభ్రత వాతావరణంలో పిల్లలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

విద్యాహక్కు చట్టంతో..

గతంలో విద్యార్థులకు సరిపడ మరుగుదొడ్లు అందుబాటులో ఉండేవి కావు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి పాఠశాలలో మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసిన క్రమంలో పాఠశాలలో పెద్దఎత్తున మరుగుదొడ్లను నిర్మించారు. కరోనాకు ముందు పాఠశాలలో మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు స్వచ్ఛకార్మికులను ఏర్పాటు చేశారు.

టాయిలెట్లు శుభ్రం చేసేందుకు నెలకు రూ.3500..

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టాయిలెట్లను శుభ్రం చేసేందుకు నెలకు రూ.3500, ప్రాథమిక పాఠశాలలకు రూ.2000ల చొప్పున స్కావెంజర్ల నియామకానికి నిధులు అందజేశారు. గత రెండేళ్లుగా స్కావెంజర్లను ఏర్పాటు చేయకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు దుర్గంధభరితంగా మారడంతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.

నిబంధనలు ఇలా....

నిబంధనల ప్రకారం ప్రభుత్వ పాఠశాలలో 200ల మంది విద్యార్థులు ఉంటే తప్పనిసరిగా బాలికలు, బాలురకు మూడు మరుగుదొడ్లు, రెండు మూత్రశాలలు వేర్వేరుగా ఉండాలి. నియోజకవర్గంలో కొన్ని పాఠశాలలు ప్రాధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సొంత డబ్బులతో మరుగుదొడ్లను శుభ్రం చేయిస్తున్నారు. ప్రస్తుతం ఈ విద్యాసంవత్సరంలోనైనా విద్యార్థుల తల్లిదండ్రులు స్కావెంజర్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


అపరిశుభ్రంగా మారిన టాయిలెట్స్ ఇలా..

స్కావెంజర్లను నియమించాలి..



ప్రభుత్వ పాఠశాలలో పేద మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులే ఎక్కువగా చదువుతారు. వారికి పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడం వారి హక్కులను కాలరాయడమే అవుతుంది. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలి.

– ఎంసీ మహేందర్‌బాబు, స్థానికుడు

కనీస సౌకర్యాలు కల్పించాలి..



ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై 10 రోజులు గడుస్తున్నా.. టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వ పాఠశాల విద్యను బలోపేతం చేస్తున్నామని ఆర్భాటాలకు పోతున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలించి విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలి.

– నితీష్, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

పద్మశాలీలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే కాలేరు


పద్మశాలి కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: పద్మశాలి సంఘానికి ఎల్లప్పుడు అండగా ఉంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శివంరోడ్డులోని న్యూ అజం కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం కార్యాలయాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పద్మశాలి సంఘం చాలా పటిష్ఠంగా ఉందన్నారు. సంఘం అధ్యక్షుడుకృష్ణ, శివకుమార్, అశోక్, సుదర్శన్, డాక్టర్ పాండురంగయ్య, రమేష్, వెంకటరాజయ్య, అంజయ్య, సత్తయ్య, వెంకటరమణ, నరేందర్, తదితరులున్నారు.

భారీ వర్షం.. రహదారులు జలమయం


వివేక్‌నగర్ కాలనీలో వరద ప్రవాహం ఇలా..

చిక్కడపల్లి: నగరంలో కురిసిన భారీ వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. గాంధీనగర్, చిక్కడపల్లి, కవాడిగూడ, దోమలగూడ, బాగ్‌లింగంపల్లి, రాంనగర్, అడిక్‌మెట్, బోలక్‌పూర్, కవాడిగూడ, ఎన్‌టీఆర్ స్టేడియం, ఇందిరాపార్క్, అశోక్‌నగర్, బాపూనగర్, అరుంధతినగర్, సబర్మతీనగర్ తదితర లోతట్టు ప్రాంతాలు, బస్తీలు జలమయమయ్యాయి. వాహనదారులు, స్థానిక ప్రజలు ఇబ్బంది పడ్డారు.

బీఆర్‌ఎస్ నేత సాయికిరణ్ మృతి

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ ఫ్రెండ్స్ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చింతల సాయికిరణ్ మృతి చెందారు. ఆదివారం బీఆర్‌ఎస్ యువనేత ముఠా జైసింహ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి, ఆయన చేసిన సేవలను కొనియాడారు. ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు పూసగోరఖ్‌నాథ్, అరుణ్ తదితరులున్నారు.

కేంద్రమంత్రికి శుభాకాంక్షలు


కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళామోర్చా నేతలు

కాచిగూడ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆదివారం బర్కత్‌పురలోని ఆయన నివాసంలో బీజేపీ మహిళా మోర్చా ప్రతినిధులు అనురాధ గుప్తా, శిరీష, శోభాచందర్, సావిత్రి తదితరులు కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రమంత్రి నేతృత్వంలో రాష్ట్రంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు రాష్ట్రాభివృద్ధికి అత్యధిక నిధులు తీసుకొస్తారన్నారు.

కవాడిగూడ: కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నేతలు గండి కృష్ణమాదిగ, గజ్జల రాజశేఖర్ ఆధ్వర్యంలో సన్మానించారు. బీజేపీ దళిత మోర్చా నాయకులు నర్సింహమాదిగ ఉన్నారు.

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

పద్మారావునగర్: స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 255వ అన్నదాన కార్యక్రమాన్ని సినీ నటుడు గౌతం రాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఎంతోమంది నిరుపేదలు ఆకలితో అలమటిస్తున్నారని వారి సౌకర్యార్థం ఫౌండేషన్ వారు అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వై. సంజీవకుమార్, పావనీ, నేహా, రోష్ని అఖిల్, ఇర్ఫాన్, జతిన్, శుభం పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ దేశభక్తి యువతకు ఆదర్శం


బర్కత్‌పురలో నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు


శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రమేష్‌రాం, కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ దేశభక్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు బీజేపీనేతలు పిలుపునిచ్చారు. ఆదివారం కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఎంసీ. మహేందర్‌బాబు ఆధ్వర్యంలో ఇందిరాపార్కు చౌరస్తాలో జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ రమేష్ రాం, కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాలు, భారత జాతి ప్రయోజనాలకు వారధిగా ఏర్పడిన బీజేపీ ఆశయాలను ముందుకు తీసుకెళ్తుందన్నారు. మాజీ కార్పొరేటర్ రవీందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, రాంరెడ్డి, రంగారాజుగౌడ్, వెంకట్‌రెడ్డి, మహేష్, ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, దిలీప్‌యాదవ్, రమేష్‌గౌడ్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంట: నల్లకుంట కార్పొరేటర్ అమృత ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంటలోని కార్పొరేటర్ కార్యాలయంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ ను నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎస్. నర్సింగ్‌రావు, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎంబీ.కిశోర్‌కుమార్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజే.బాబు, నాయకులు మంగి శివకుమార్, మధుయాదవ్, ఎం. మురళీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ: డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను నిర్వహించారు. బీజేపీ నేతలు నందకిషోర్ యాదవ్, శ్యామ్‌రాజ్, ఉమారమేష్‌యాదవ్, సుభాష్ పటేల్, ఏడెల్లి అజయ్‌కుమార్, వై.అమృత, ఎక్కాల కన్నా, వనం రమేష్, అనంతలక్ష్మి, చుక్క జగన్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంట: అఖండ భారతావని నినాదాన్ని ఎలుగెత్తి చాటిన గొప్ప దేశ భక్తుడు, జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని నల్లకుంట మాజీ కార్పొరేటర్ వనం రమేష్ కొనియాడారు. ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు.


మాజీ కార్పొరేటర్ వనం రమేష్


నల్లకుంట కార్పొరేటర్ అమృత

కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కృష్ణగౌడ్

అంబర్‌పేట: ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శిగా అంబర్‌పేటకు చెందిన తొలుపునూరి కృష్ణగౌడ్‌ను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి ఆదివారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణగౌడ్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన మాజీ పీసీసీ అధ్యక్షుడు హనుమంతరావు, రోహిణ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. పార్టీ నేతలు యాదగిరిగౌడ్, నాగభూషణం పాల్గొన్నారు.


నియామకపత్రాన్ని అందజేస్తున్న రోహిణ్‌రెడ్డి

ఎంబీఏ విద్యార్థులకు మంచి అవకాశాలు


ఎంబీఏ విద్యార్థులతో అధ్యాపకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నేటి పోటీ ప్రపంచంలో ఎంబీఏ విద్యార్థులకు మంచి అవకాశాలు లభిస్తున్నాయని ప్రముఖ నేపథ్య గాయకుడు ప్రభు అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంబీఏ కళాశాలలో 2022–24 బ్యాచ్ విద్యార్థుల వీడ్కోలు పార్టీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభు మాట్లాడుతూ.. క్రమశిక్షణ పట్టుదల ఉంటే అసాధ్యమంటూ ఏది లేదన్నారు. ప్రణాళిక బద్ధంగా విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో తట్టుకోవాలంటే నిరంతర అధ్యాయం, నైపుణ్యత అవసరమని పేర్కొన్నారు. ఫ్యాకల్టీ కో– ఆర్డినేటర్ సునంద, ప్రిన్సిపాల్ నాగరాజు, డైరెక్టర్ రిషికాంత్, కళాశాల కార్యదర్శి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్‌పై హర్షం

కాచిగూడ: రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై తెలంగాణ రాష్ట్ర జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మయ్య, ప్రధానకార్యదర్శి ఎం.పర్వతాలుగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో కేజీ టూ పీజీ విద్యాసంస్థలు, హాస్టళ్లలో చదివే విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించలేక అనేక ప్రభుత్వ విద్యాసంస్థలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం


అశోక్ యాదవ్

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నదని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అధ్యాపక నియామకాలు చేపట్టకుండా, నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వ వర్సిటీలను నిర్లక్ష్యం చేసి 11 ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. 6 వేలకు పైగా ప్రభుత్వ స్కూల్స్ మూతపడ్డాయని నాడు ప్రతి పక్షనేతగా విమర్శించిన రేవంత్ రెడ్డి అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి, వీసీలను నియమించకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యజమానులు ఇష్టారాజ్యాంగా ఫీజులు, డొనేషన్లు దండుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.